సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం । 9 । ఫిబ్రవరి । 2025



సోమశిలలో 65.133 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారానికి 65.133 టీఎంసీలు ఉన్నాయి. 1025 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువ కాలువలకు 4000 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.87,650
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,945
3 శాతం జీఎస్టీతో	రూ.8,183
నవర (8 గ్రా)	రూ.65,464

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.2 /24.0

జిల్లాలో ఆదివారం వాతావరణం పొడిగా ఉంటుందని ఆశాఖాధికారులు తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. గాలిలో తేమ 65 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

కెరీర్‌ను విద్యార్థులు మెరుగు పరుచుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

నెల్లూరు (టౌన్): కార్పొరేట్ ప్రపంచంలో విద్యార్థులు తమ కెరీర్‌ను ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకోవాలని కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక కస్తూర్బా కళాక్షేత్రంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా, కమిటీ ఫర్ అకౌంటింగ్ టెక్నీషియన్స్ ఆధ్వర్యంలో నెల్లూరు చాప్టర్‌తో కలిసి 2వ జాతీయ క్యాట్ స్టూడెంట్స్ కన్వెన్షన్ 2025ను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ పాలన, నియంత్రణ, ఫ్రేమ్ వర్క్‌ను వివరించారు. విద్యార్థులు సూత్రప్రాయమైన విధానాన్ని అనుసరించాలన్నారు. సీఎంఏ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ ప్రెసిడెంట్ బి.భూతిభూషన్ నాయక్, వైస్ ప్రెసిడెంట్ రాజేంద్ర మాట్లాడుతూ నేటి ఆర్థిక వాతావరణంలో కాస్ట్, మేనేజ్‌మెంట్ అకౌంటెట్లు పాత్ర కీలకమన్నారు. ఫైనాన్స్ రంగంలో ఉన్నత లక్ష్యాలను సాధించడానికి క్యాట్ కోర్సు విలువను తెలియజేశారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీఎంఏఐ కౌన్సిల్ సభ్యులు చిత్తరంజన్ చటోపాధ్యాయ, సీఏవీఎస్ఎన్ మూర్తి, వినయరంజన్, సురేష్, ఐసీఎంఏఐ నెల్లూరు చాప్టర్ చైర్మన్ విశ్వనాథ్ భట్, వైస్ చైర్మన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ సింధుప్రియ ఔదార్యం



దంపతులతో రైల్వేస్టేషన్ వద్ద సంతపేట పోలీసు సిబ్బంది

నెల్లూరు సిటీ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ గర్భిణికి పురుటి నొప్పులు రావడంతో నెల్లూరులో అత్యవసరంగా చికిత్స కోసం దిగి తిరిగి వెళ్లేందుకు సైతం డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న దంపతుల పట్ల నగర డీఎస్పీ సింధుప్రియ ఔదార్యం చూపించారు. పాడేరు ప్రాంతానికి చెందిన భార్యాభర్తలు ఇద్దరు పిల్లలతో కలిసి తిరుపతి నుంచి అనకాపల్లికి శనివారం రైల్లో వెళ్తున్నారు. ఎనిమిది నెలల గర్భిణి భార్యకు నొప్పులు వచ్చాయి. దీంతో హుటాహుటిన నెల్లూరులో దిగి హాస్పిటల్‌లో చికిత్స చేయించుకున్నారు. ఆమె ఆరోగ్యం కుదుట పడడంతో తిరిగి తమ ఊరికి వెళ్లేందుకు నగదు లేకపోవడంతో దీన స్థితిలో రైల్వేస్టేషన్‌లోనే ఉన్నారు. ఓ ప్రయాణికుడు ఈ విషయాన్ని నగర డీఎస్పీ సింధుప్రియ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె వెంటనే స్పందించి సంతపేట పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించి, మహిళా కానిస్టేబుల్ పుల్లమ్మను వెంటనే రైల్వేస్టేషన్ వద్దకు పంపారు. వారి భోజనాలకు అవసరమైన నగదుతోపాటు ఊరికి వెళ్లేందుకు టికెట్లు కొని అందజేశారు.

మన బడికి తాళం

జిల్లాలో 950 పాఠశాలలు మూతపడే అవకాశం

- డీఎస్సీలో పోస్టుల కోతకు వ్యూహం
- విలీనం పేరుతో యూపీ, ఏకోపాధ్యాయ పాఠశాలలకు మంగళం?
- 60 మందికి కంటే తక్కువగా ఉన్న పాఠశాలలు 179
- జిల్లాలో ఏకోపాధ్యాయ పాఠశాలలు 742
- స్కూల్స్ అసిస్టెంట్లను హైస్కూల్స్‌కు బదిలీ
- ఇప్పటికే డ్రాప్ బాక్స్‌లో 34,159 మంది విద్యార్థులు
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు



ప్రతి గ్రామంలో మోడల్ ప్రైమరీ పాఠశాలల పేరుతో మన బడికి తాళం వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యూహం పన్నింది. మెగా డీఎస్సీ పేరుతో దగా చేసిన ఈ ప్రభుత్వం మరో కుట్రకు తెర తీసినట్లు తెలుస్తోంది. విలీన ప్రక్రియలో భాగంగా యూపీ, ఏకోపాధ్యాయ పాఠశాలలకు మంగళం పాడే దిశగా అడుగులు పడుతున్నాయి. మిగిలిన పోస్టుల భర్తీకే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ విద్యా సంవత్సరంలోనే ఇరవై శాతం మంది విద్యార్థులు డ్రాప్ అవుట్స్ ఉన్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి.

నెల్లూరు (టౌన్): సర్కారు బడులను నిర్వీర్యం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. ఇప్పటికే పేద విద్యార్థులను చదువులకు దూరం చేసేందుకు తల్లికి వందనం (అమ్మఒడి) వాయిదా వేసింది. తొలి సంతకం పేరుతో 16 వేల పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించినా షెడ్యూల్ కేటాయించకుండా విద్యా సంవత్సరం పాటు కాలయాపన చేసింది. డీఎస్సీలో పోస్టుల కోతకు వ్యూహంతో తాజాగా మెగా డీఎస్సీని 'స్మార్ట్' డీఎస్సీగా మార్చేందుకు మోడల్ స్కూళ్ల పేరుతో మోసానికి తెగపడుతోంది. జిల్లాలో 2,592 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 2,021 ప్రాథమిక, 238 ప్రాథమికోన్నత, 333 ఉన్నత పాఠశాలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 1,81,392 మంది విద్యార్థులు చదువుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ, ఇంగ్లిష్ మీడియం, వర్చువల్ బోధన, టోఫెల్ పరీక్ష విధానం తదితర వాటిని ప్రవేశ పెట్టి విద్యార్థులకు నాణ్యమైన ఉత్తమ బోధనకు శ్రీకారం చుట్టింది.

ప్రాథమికోన్నత పాఠశాలలకు మంగళం

అధికారంలోకి వస్తే ఒక్క పాఠశాలను కూడా తొలగించబోమని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు తుంగలో తొక్కుతున్నారు. తాజాగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రతి గ్రామ పంచాయతీలో మోడల్ ప్రైమరీ పాఠశాలను ఏర్పాటు చేస్తామని కొత్త నాటకానికి తెర తీశారు. 60 మంది విద్యార్థుల కంటే తక్కువ ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను గుర్తించాలని మార్గదర్శకాలు జారీ చేశారు. జిల్లాలో మొత్తం 238 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 60 మంది విద్యార్థుల కంటే తక్కువగా ఉన్న పాఠశాలలు 179 ఉన్నట్లు జిల్లా విద్యాశాఖాధికారులు లెక్కలు తేల్చారు. ఆయా పాఠశాలల్లో 6, 7, 8 తరగతుల విద్యార్థులతో పాటు స్కూల్ అసిస్టెంట్లను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయనున్నారు. ఇదే జరిగితే ఆయా పాఠశాలల్లో 10 నుంచి 15 మంది విద్యార్థులు మాత్రమే మిగిలే పరిస్థితి. వీటిని పరిగణలోకి తీసుకుని తక్కువ పిల్లలు ఉన్న పాఠశాలల్లోని విద్యార్థులను సమీపంలోని పాఠశాలల్లో విలీనం చేసి ఈ పాఠశాలలను పూర్తిగా ఎత్తివేసే ఆలోచనలో ఉన్నట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు అనుమానిస్తున్నారు.

జిల్లాలో 742 ఏకోపాధ్యాయ పాఠశాలలు

జిల్లాలో 742 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. కొన్ని పాఠశాలల్లో 20 నుంచి 30 మంది విద్యార్థులు ఉంటే మరికొన్ని పాఠశాలల్లో 10 నుంచి 20 మంది లోపు ఉన్నారు. ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీలో మోడల్ ప్రైమరీ పాఠశాలను ఏర్పాటు చేయనున్నట్లు చెబుతోంది. అయితే మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటయితే సమీప ప్రాథమిక పాఠశాలలు, ఏకోపాధ్యాయ పాఠశాలల్లో తక్కువ మంది విద్యార్థులు ఉన్నారన్న కారణం చూపి ఆ పాఠశాలల్లోని విద్యార్థులను మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో విలీనం చేయనున్నారు. అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులను సైతం ఈ పాఠశాలలకు బదిలీ చేయనున్నారు. ఈ లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా సుమారు 950 పాఠశాలలను మూతవేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

డ్రాప్ బాక్స్‌లో 34,159 మంది విద్యార్థులు

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలను ఎత్తివేసే దిశగా చేపడుతున్న రాష్ట్ర ప్రభుత్వ చర్యలను విద్యార్థులు తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఈ విద్యా సంవత్సరంలో 34,159 మంది విద్యార్థులు డ్రాప్ బాక్స్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. 2023–24లో ప్రభుత్వ పాఠశాలల్లో 3,54,793 మంది విద్యార్థులుంటే 2024–25 విద్యా సంవత్సరంలో 3,41,465 మంది విద్యార్థులు ఎన్‌రోల్‌మెంట్ ఉంది. దీన్ని బట్టి 34,159 మంది విద్యార్థులు బడికి దూరమయ్యేనట్లే. తల్లికి వందనం పథకం అమలు చేయకపోవడం, ప్రభుత్వ పథకాలు సక్రమంగా అర్హులైన విద్యార్థులకు చేరకపోవడమే ఇందుకు కారణమని విద్యావేత్తలు చెబుతున్నారు.



ఇందుకూరుపేట మండలం గమళ్లపాలెం ప్రాథమిక పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న పేరెంట్స్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు (ఫైల్)

అస్తవ్యస్తంగా విద్యా వ్యవస్థ



ఎన్నికలకు ముందు 117 జీఓ రద్దు చేస్తామని చెప్పి ఆ రద్దు పేరుతో మెమో ఇచ్చారు. ఈ ప్రకారం విద్యావ్యవస్థ పెనంపై నుంచి పొయ్యిలో పడినట్లుగా ఉంది. మోడల్ స్కూల్స్ పేరుతో ప్రాథమిక పాఠశాలలను లేకుండా రద్దు చేస్తున్నారు. పైకి చెప్పేదొకటి చేసేది మరొకటిగా ఉంది. వేలాది స్కూల్స్‌ను సింగిల్ డిజిట్, సింగిల్ టీచర్‌గా మారుస్తున్నారు. విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతుంది.

– నవకోటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యూటీఎఫ్

పాఠశాలలను ఎత్తివేయడం సమంజసం కాదు



60 మంది లోపు విద్యార్థులు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలల్లోని 6, 7, 8 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం సమంజసం కాదు. డ్రాప్ అవుట్‌గా మారే ప్రమాదం ఉంది. వారికి రవాణా భత్యం ఇస్తామని చెప్పడం వాస్తవ రూపం దాల్చదు. మోడల్ ప్రైమరీ స్కూల్ పేరుతో 3, 4, 5 తరగతులను విలీనం చేసి ఆ పాఠశాలను ఎత్తి వేస్తే పేద, బడుగు వర్గాల పిల్లలు చదువుకు దూరమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే ఉన్నత, ఇంటర్ విద్యను ప్రభుత్వ రంగంలో నామరూపాలు లేకుండా చేసిన ప్రభుత్వాలు ఇప్పుడు ప్రాథమిక విద్యను కూడా ప్రైవేట్ పరం చేసేందుకు కుట్ర జరుగుతోంది.

– మోహన్‌దాస్, రాష్ట్ర నాయకులు, ఏపీటీఎఫ్

సముద్ర తాబేళ్ల పరిరక్షణకు చర్యలు

- ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ ఏకే నాయక్





మాట్లాడుతున్న ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ అధికారి ఏకే నాయక్, చిత్రంలో అధికారులు

నెల్లూరు(అర్బన్): సముద్ర తాబేళ్ల పరిరక్షణకు స్వచ్ఛంద సంస్థలు, మత్స్య, మెరైన్ తదితర శాఖల సమన్వయంతో యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశామని రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఏకే నాయక్ తెలిపారు. తాబేళ్ల అవసరం, వాటిని కాపాడుకోవడం అనే అంశంపై వివిధ జిల్లాల అటవీశాఖ అధికారులు, ట్రీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో వర్క్‌షాపు జరిగింది. ఏకే నాయక్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో తీరంలో 2 వేల నుంచి 3 వేల వరకు తాబేళ్లు మృతి చెందాయన్నారు. దీనికి ప్రధాన కారణం మత్స్యకారులు సముద్రంలో వారికి కేటాయించిన దూరం వెళ్లకుండా పెద్ద, పెద్ద యంత్రాలతో కూడిన బోట్లను వాడడం, మెకనైజ్డ్ వలలను వాడడమే కారణమన్నారు. సముద్రంలో నుంచి గుడ్లు పెట్టేందుకు తీరంలోకి వస్తున్న తాబేళ్లు ఆ వలలో పడి మృత్యువాత పడుతున్నాయన్నారు. తాబేళ్లతో సముద్రంలో జీవ సమతుల్యత ఏర్పడుతుందన్నారు. అవి నీటిని పరిశుభ్రం చేస్తాయన్నారు. అలాంటి జీవులను కాపాడుకోకపోతే మత్స్య సంపదకు కూడా ముప్పు వస్తుందన్నారు. అందువల్ల మత్స్యకారులు తీరం సమీపంలో వేట చేయరాదన్నారు. దూరం వెళ్లి వేట సాగించాలన్నారు. సంప్రదాయ బోట్లను మాత్రమే వాడాలన్నారు. ఇందుకోసం మత్స్యకారులను చైతన్యం చేయాలన్నారు. మత్స్య, మెరైన్ శాఖల అధికారులు, ఎన్‌జీఓలు కలిసి ప్రణాళికాబద్ధంగా రాష్ట్ర వ్యాప్తంగా చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఎవరైనా తాబేళ్లను పట్టుకుని అక్రమంగా తరలిస్తే అలాంటి వారిపై కఠినమైన వైల్డ్ లైఫ్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేయిస్తామన్నారు. తాబేళ్ల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ఫారెస్ట్, ఇతర శాఖల అధికారులు చర్చించారు. జిల్లాల వారీగా చర్చలు జరిపారు. నెల్లూరు టెరిటోరియల్ ఫారెస్ట్, ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గుంటూరు ఫారెస్ట్ కన్జర్వేటర్ కేవీ రాజు, తిరుపతి కన్జర్వేటర్ సెల్వం, నెల్లూరు డీఎఫ్ఓ మహబూబ్‌బాషా, సూళ్లూరుపేట వైల్డ్‌లైఫ్ ఫారెస్ట్, ప్రకాశం, ఏలూరు, బాపట్ల తదితర జిల్లాల ఫారెస్ట్ అధికారులు మత్స్యశాఖ అధికారులు, ఇండియన్ కోస్ట్ గార్డు , మెరైన్ పోలీసు, మత్స్యశాఖ అధికారులు, ట్రీ ఫౌండేషన్ బాధ్యులు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

- రామాయపట్నం పోర్టుతో పారిశ్రామికంగా అభివృద్ధి
- స్కిల్ డెవలెప్‌మెంట్ సెంటర్‌లో యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాల కల్పన
- కలెక్టర్ ఆనంద్



నూతన అర్బన్ హెల్త్ సెంటర్ భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి: రామాయపట్నం పోర్టు ఆధారిత పరిశ్రమల ఏర్పాటుతో కావలి పట్టణం పారిశ్రామికంగా అభివృద్ధి చెందనుందని కలెక్టర్ ఆనంద్ అన్నారు. శనివారం కావలిలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కృష్ణారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఇందిరమ్మ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ రామాయపట్నం పోర్టుకు అనుసంధానంగా బీపీసీఎల్ రిఫైనరీ, ఇండోసోల్ సోలార్ ఎనర్జీ ప్లాంట్ వంటి అనేక పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని, ఈ ప్రాంత విద్యార్థులు, నిరుద్యోగ యువత అందరూ కూడా స్కిల్ నైపుణ్యాలు మెరుగు పరుచుకుని పోర్టు ఆధారిత పరిశ్రమల్లో పెద్ద ఎత్తున ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందాలని పిలుపునిచ్చారు. కావలి ప్రాంతంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్కిల్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ కావలి సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. రూ.కోటి ప్రత్యేక నిధులతో షాదీ మంజిల్ నిర్మాణం, కాలువలో పూడిక తీత పనులు, పలు రోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నట్లు వివరించారు. కావలి ప్రాంత యువత స్కిల్ ట్రైనింగ్ కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ఏడాది పాటు వివిధ వృత్తి నైపుణ్య కోర్సుల్లో వారికి శిక్షణ అందించి పలు పరిశ్రమల్లో ఉద్యోగాలు పొందేలా కృషి చేస్తామని చెప్పారు. 2008లో ఏర్పాటు అయిన ఈ ఇందిరమ్మ కాలనీలో స్థానికులకు మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ కావలిలో ఇందిరమ్మ కాలనీలో రోడ్డు నిర్మాణంతో పాటు అవసరమైన పనులకు నుడా నిధులను మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు కలెక్టర్, ఎమ్మెల్యే, నుడా చైర్మన్ అందజేశారు. అనంతరం కావలిలోని టిడ్కో గృహ సముదాయాల్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీఓ వంశీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, డీఎంహెచ్ఓ సుజాత, డిప్యూటీ డీఎంహెచ్ ఓ బ్రిజిత, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం ధరలు దగా

రైతుల నడ్డి విరుస్తున్న మిల్లర్లు

- ధరలు తగ్గించి ధాన్యం కొనుగోళ్లు
- ఏ గ్రేడ్ రకం క్వింటా రూ.2,320, సాధారణ రకం రూ.2,300
- గత సీజన్‌లో బీపీటీ పుట్టి ధాన్యం రూ.28 వేలు
- ప్రస్తుతం రూ.16 వేల నుంచి రూ.17 వేలకు కొనుగోలు
- రైస్‌మిల్లర్లు, దళారులు కుమ్మక్కు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు అనేక విధాలుగా దగాకు గురవుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు మద్దతు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారు. గత ప్రభుత్వంలో ఎన్నడూ లేని విధంగా రైతులు పండించిన పంటను ప్రతి సీజన్‌లోనే ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరకే అమ్ముకుని ఆర్థికంగా స్థిరపడ్డారు. గతేడాది ఇదే సీజన్‌లో పుట్టి ధాన్యం ఊహించని ధరలకు అమ్ముకున్నారు. ప్రస్తుతం రైస్‌మిల్లర్లు, దళారులు కుమ్మక్కై ధాన్యం ధరలు తగ్గించి దోచుకుంటున్నారు. కనీసం మద్దతు ధర లభించడం లేదని రైతులు వాపోతున్నారు.



నెల్లూరు (పొగతోట): వైఎస్సార్‌సీపీ పాలన రైతాంగానికి స్వర్ణయుగంగా చెప్పాలి. రైతు భరోసా, ఉచిత పంటల బీమా, వడ్డీ రీయింబర్స్‌మెంట్, పంట నష్టపరిహారం వంటి సంక్షేమ ప్రయోజనాలను ఎప్పటికప్పుడు అందుకున్నారు. ఇంతకంటే మిన్నగా ప్రయోజనాలు అందిస్తామని అధికారం దక్కించుకున్న కూటమి ప్రభుత్వం మంగళం పలికింది. కనీసం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు దిక్కులేని పరిస్థితి ఏర్పడింది. జిల్లా అధికారుల నుంచి ప్రభుత్వ పెద్దలకు పంటకు మద్దతు ధర కల్పిస్తామంటూ చెబుతున్నారే కానీ క్షేత్రస్థాయిలో కనీస ధరలు అమలు కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

గతంలో మద్దతు ధరలు అమలు

వైఎస్సార్‌సీపీ పాలనలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర దక్కేలా చర్యలు చేపట్టింది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే అధికంగా వస్తే రైతులు బయటకు అమ్ముకునే విధంగా అవకాశం కల్పించింది. ప్రతి రైస్‌మిల్లర్ ఆర్‌బీకేల ద్వారానే ధాన్యం కొనుగోలు చేయాలనే నిబంధనలు పెట్టింది. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం ఎంత మద్దతు ధర ప్రకటించిందో అంతే ధరకు రైతులు ధాన్యాన్ని అమ్ముకున్నారు. మార్కెట్‌లో బీపీటీ, నెల్లూరు మసూర, ఇతర రకాలకు డిమాండ్ అధికంగా ఉంది. పుట్టి ధాన్యం బీపీటీ రకం రూ.27 వేల నుంచి రూ.28 వేలకు ధరలు పలికాయి. మిగతా రకాలు అయితే పుట్టి రూ.24 వేలకు విక్రయించారు.


కూటమి పాలనలో కుప్పకూలిన ధరలు

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ధాన్యం ధరలు పూర్తిగా పతనమయ్యాయి. రైస్‌మిల్లర్లు, దళారులు కుమ్మక్కై ధరలను తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. తేమ శాతం సాకు చూపి ధాన్యానికి డిమాండ్ లేదంటూ ధరలు తగ్గిస్తున్నా రు. ప్రస్తుతం ఏ గ్రేడ్ రకం క్వింటా రూ.2,320 (పుట్టి రూ.19604) సాధారణ రకం రూ.2,300 (పుట్టి రూ.19,435) ఉంది. జిల్లాలో అక్కడక్కడా వరికోతలు ప్రారంభమయ్యాయి. అయితే ప్రస్తు తం బీపీటీలను పుట్టి రూ.16 వేల నుంచి రూ.17 వేలకు మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారు. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే రైతులు పుట్టికి రూ.12 వేల వరకు నష్టపోతున్నారు. గతంలో జిల్లాలో పనిచేసిన అధికారులు అప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇతర జిల్లాల నుంచి రైస్‌మిల్లర్లను ఆహ్వానించి జిల్లాలో ధాన్యం కొనుగోలు చేయించారు. దీంతో పుట్టి రూ.27 వేల నుంచి రూ.28 వేల వరకు కొనుగోలు చేశారు.

దిగుబడులకు ప్రతికూల వాతావరణం

ప్రస్తుత రబీ సీజన్‌లో జిల్లాలో 7.70 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. అయితే వాతావరణం అనుకూలించడం లేదు. మంచు అధికంగా కురవడం, చలి ఎక్కువ ఉండడంతో వరి దిగుబడి తగ్గింది. వరి దిగుబడి తగ్గడంతోపాటు ధాన్యం ధరలు కూడా తగ్గడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ నెల మూడో వారం నుంచి జిల్లా వ్యాప్తంగా వరి కోతలు అధికమయ్యే అవకాశం ఉంది. దీనికి సంబంధించి జిల్లా యంత్రాంగం రైతులకు మద్దతు ధర కల్పించేలా చర్యలు చేపట్టింది. జిల్లాలో చిన్న, పెద్ద రైస్‌మిల్లులు 300కు పైగా ఉన్నాయి. 103 మిల్లులను ధాన్యం సేకరించి రైస్ మిల్లింగ్ చేయడానికి అధికారులు గుర్తించారు. 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇతర జిల్లాల రైస్ మిల్లర్లు జిల్లాకు రానీయకుండా అడ్డుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. జిల్లా రైస్ మిల్లర్లు సిండికేట్ అయి ధరలను పతనం చేస్తున్నారు.

ధాన్యం ధరలు పతనమయ్యాయి



జిల్లాలో గత మూడు సీజన్లలో బీపీటీ రకం ధాన్యం పుట్టి రూ.27 వేల నుంచి రూ.28 వేలకు విక్రయించారు. ప్రస్తుతం సీజన్‌లో ధాన్యం ధరలు పతనమయ్యాయి. బీపీటీ రకం పుట్టి రూ.16 వేల నుంచి రూ.17 వేలకు కొనుగోలు చేస్తున్నారు. వాతావరణం అనుకూలించక ధాన్యం దిగుబడి తగ్గింది. రైతులు రెండు విధాలా నష్టపోతున్నారు. అధికారులు మద్దతు ధరకు మించి ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

– కోటిరెడ్డి, రైతు సంఘం నాయకులు


ధర తగ్గించి కొనుగోలు చేస్తే చర్యలు




రైతులకు మద్దతు ధరకు మించి ధర కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో 300 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నాం. అవసరమైతే ఇతర జిల్లాల రైస్ మిల్లర్లను ఆహ్వానించి రైతులకు అధిక ధర కల్పించేలా చర్యలు తీసుకుంటాం. రైతులకు అన్ని విధాలా జిల్లా యంత్రాంగం అండగా ఉంటుంది. రైస్ మిల్లర్లు రైతు సంఘ నాయకులతో సమావేశాలు నిర్వహించాం. మద్దతు ధరకు మించి కొనుగోలుచేయాలని ఆదేశించాం.

– కార్తీక్, జాయింట్ కలెక్టర్

రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా హాకీ పోటీలు ప్రారంభం



మార్చ్ ఫాస్ట్ చేస్తున్న నెల్లూరు జట్టు



హాకీ ఆడుతున్న క్రీడాకారులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 15వ ఆంధ్రప్రదేశ్ సీనియర్ మహిళా హాకీ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. హాకీ నెల్లూరు జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలను ఏఆర్‌డీఎస్‌పీ ఎస్.చంద్రమోహన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ హాకీ క్రీడకు పూర్వ వైభవం తేవాలన్నారు. మహిళా హాకీ పోటీలను నెల్లూరులో నిర్వహించడం అభినందనీయమన్నారు. హాకీ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఎస్.నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో హాకీ క్రీడాకారులు చక్కగా రాణిస్తున్నారన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడంలో అసోసియేషన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని వివరించారు. డీఎస్‌డీఓ ఆర్‌కే యతిరాజ్ మాట్లాడుతూ క్రీడాకారులు టోర్నమెంటులో పాల్గొనడం వల్ల క్రీడా నైపుణ్యాన్ని మెరుగు పరుచుకోవచ్చన్నారు. క్రీడలను అభివృద్ధి చేసేందుకు డీఎస్ ఏ తరఫున సహాయ సహకారాలను అందిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 జిల్లాల సీనియర్ మహిళా క్రీడా జట్లు ఈ పోటీల్లో తలపడుతున్నా యని టోర్నీ డైరెక్టర్ పి.తామస్‌పీటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హాకీ ఆంధ్రా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.హర్షవర్ధన్, వెటర్నరీ డాక్టర్ వై. మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికెన్ వ్యర్థాల లారీ పట్టివేత



కొడవలూరు: చికెన్ వ్యర్థాల లారీని పోలీసులు పట్టుకున్న ఘటన మండలంలోని పద్మనాభ సత్రం వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకొంది. అల్లూరు మండలంలోని చేపల గుంతల కోసం చికెన్ వ్యర్థాల లారీ వెళ్తుండగా, ఎస్సై కోటిరెడ్డికి సమాచారం అందింది. దీంతో పద్మనాభ సత్రం వద్ద వాహనాన్ని పట్టుకొని తరలింపుదారులపై కేసు నమోదు చేశారు.

లారీ ఢీకొని వాహనచోదకుడి మృతి



మనుబోలు: లారీ ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కొండూరు సత్రం వద్ద జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. అల్లూరు మండలం సింగపేటకు చెందిన పూనూరు రామకృష్ణారెడ్డి (65) పనుల నిమిత్తం సూళ్లూరుపేటలో ఉంటున్నారు. ఈ క్రమంలో బైక్‌పై సింగపేట వెళ్లి తిరిగొస్తుండగా, కొండూరుసత్రం సమీపంలోని పవర్ గ్రిడ్ వద్ద డివైడర్ అంచున లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించారు. ఘటన స్థలాన్ని ఎస్సై శివరాకేష్ పరిశీలించారు. మృతుడి బంధువులకు సమాచారం అందించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పూరిల్లు దగ్ధం

సీతారామపురం: పూరిల్లు దగ్ధమైన ఘటన సీతారామపురంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయ సమీపంలో గల ఎస్టీ కాలనీలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. జీవనోపాధి నిమిత్తం వెంగయ్య దంపతులు బెంగళూరు వెళ్లగా, వారి పిల్లలు ఇంటి వద్ద ఉంటున్నారు. ఈ క్రమంలో కట్టెల పొయ్యిపై వండుతుండగా, నిప్పు రవ్వలు ఎగిసి పూరింటికి అంటుకున్నాయి. చుట్టుపక్కల వారు వచ్చేలోపే అగ్నికి ఆహుతైంది. గృహోపకరణాలు, దుస్తులు తదితర వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.1.5 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు.

బెల్టుషాపుపై దాడి

ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నం మజరా పల్లెపాళెంలో బెల్టుషాపుపై దాడులను ఎక్సైజ్ అధికారులు శనివారం చేపటారు. అక్రమంగా నిల్వ ఉంచిన 44 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేశామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

కండలేరులో నీటి నిల్వ



రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 53.977 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 650, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 170, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని వివరించారు.


వేడుకగా సత్యనారాయణ వ్రతం



నెల్లూరు(బృందావనం): భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. సామూహిక వ్రతానికి 216 మంది దంపతులు హాజరయ్యారు. పూజలను దేవస్థాన ప్రధానార్చకుడు శివయ్య ఆధ్వర్యంలో జరిపారు. భక్తులకు పూజా సామగ్రిని దేవస్థాన పాలకమండలి ఆధ్వర్యంలో అందజేశారు. పాలకమండలి చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు శేగు షణ్ముఖరావు, కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి వొమ్మిన జనార్దన్‌రావు, తవ్వా బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు

పెద్దవి:	రూ.40
సన్నవి:	రూ.25
పండ్లు:	రూ.18



పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.112
లేయర్	రూ.85
బ్రాయిలర్ చికెన్:	రూ.204
స్కిన్‌లెస్ చికెన్:	రూ.230
లేయర్ చికెన్	రూ.145



నిమ్మసాగు @ 60 ఏళ్లు

మండలంలో నిమ్మ సాగుకు ఆరు దశాబ్దాలు నిండింది. వాస్తవానికి గతంలో కనీస అవసరాలను సైతం తీర్చుకోలేక జొన్న పంట పండించుకొని రైతులు జీవనం సాగించేవారు. నిమ్మ పుణ్యమాని ప్రస్తుతం ఈ ప్రాంత మెట్ట రైతులు ఆర్థిక స్వావలంబన సాధించి పిల్లలను మంచి చదువులు చదివించుకొని ప్రతి పల్లెలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా తీర్చిదిద్దారు. – పొదలకూరు



పొదలకూరు నిమ్మ మార్కెట్ యార్డు



కొమ్మకు కాసిన కాయలు

తొలిసారి ఇలా..

ఆరు దశాబ్దాల క్రితం 1965లో మండలంలోని చాటగొట్లలో నిమ్మతోటల సాగును నలగర్ల కుటుంబం తొలిసారిగా చేపట్టింది. రైల్వేకోడూరు నుంచి మొక్కలను తీసుకొచ్చి నాటారు. తర్వాత మొగళ్లూరులో ఒకరిద్దరు రైతులు నిమ్మపై మక్కువ చూపి తోటలను సాగు చేశారు. ప్రస్తుతం ఈ గ్రామాల్లో రెండు వందల తోటలు సాగులో ఉన్నాయి. ఆపై చుట్టుపక్కల గ్రామాలు, మండలాలకు విస్తరించి వేల హెక్టార్లలో తోటలు వెలిశాయి. ఫలితంగా మెట్ట రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశం ఏర్పడింది. ఈ ప్రాంతంలో నిమ్మ ఏడాది పొడవునా కాయల దిగుబడిస్తుంది. డైవాన్ నిమ్మసాగు చేపట్టేందుకు కొందరు రైతులు రెండేళ్ల క్రితం ఆసక్తి కనబర్చారు. అయితే ఇది ఆశించిన స్థాయిలో దిగుబడినివ్వలేదు.



సాగులో నిమ్మ తోటలు

తోటలు విస్తరిస్తూనే ఉన్నాయి



పొదలకూరు పరిసర ప్రాంతాల్లో నిమ్మ తోటలు విస్తరిస్తూనే ఉన్నాయి. ఈ ప్రాంత రైతులకు సాగుపై మంచి అవగాహన ఉండటంతో యాజమాన్య పద్ధతులను బాగా పాటిస్తారు. తెలియని విషయాలను ఆరాతీస్తారు. తోటలకు చీడపీడలు అధికమవుతుంటాయి. పరిశీలించి సూచనలు చేస్తుంటా.

– ఆనంద్, ఉద్యానాధికారి, పొదలకూరు

సెంటిమెంట్‌గా మారిన సాగు

- తొలిసారిగా చాటగొట్ల.. ఆపై మొగళ్లూరులో
- ప్రస్తుతం వేల హెక్టార్లలో తోటలు
- మెట్ట రైతుల వరప్రసాదినిగా మారిన వైనం
- పొదలకూరులో ప్రభుత్వ మార్కెట్ యార్డు

నిమ్మ సాగు ఇక్కడ సెంటిమెంట్‌గా మారింది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే బంధువులకు తోటల సాగుపై ఇక్కడి వారు వివరిస్తుంటారు. పొదలకూరు పరిసర ప్రాంతాల్లోనే నాలుగు వేల హెక్టార్లలో సాగు విస్తరించి ఉంది. జిల్లాలో ఉద్యాన పంటల కింద 17 వేల హెక్టార్లలో సాగుచేస్తున్నారు. మెట్ట భూముల్లో నిమ్మ తోటలు బాగా పెరిగి కాయల ఎగుమతులను దృష్టిలో ఉంచుకొని పాతికేళ్ల క్రితమే పొదలకూరులో మార్కెట్ యార్డును 13 ఎకరాల్లో ప్రభుత్వం నెలకొల్పింది.

యార్డులో దుకాణాల కోసం పోటీ

పొదలకూరు గేట్ సెంటర్‌లో రోడ్లపై నిమ్మకాయలను పెట్టి పాతికేళ్ల క్రితం ఎగుమతులు చేసేవారు. ట్రాఫిక్ స్తంభించడంతో పాటు వ్యాపారులు ఎండా, వానకు ఇబ్బందులు పడేవారు. ఈ క్రమంలో మనుబోలు రోడ్డులో 13 ఎకరాలను మార్కెటింగ్ శాఖ సేకరించి నిమ్మ మార్కెట్ యార్డును ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఇది జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోనూ గుర్తింపు తెచ్చుకుంది. ఇక్కడ దుకాణాల కోసం పోటీ పడుతున్న పరిస్థితి. సీజన్లో నిత్యం వివిధ రాష్ట్రాలకు 25 లారీల్లో ఎగుమతవుతాయి. ఇక్కడ కనీసం 150 మంది హమాలీలు జీవనోపాధి పొందుతుండగా, వ్యాపారులు పదుల సంఖ్యలో ఉన్నారు. మార్కెట్ నుంచి ఢిల్లీ, చెన్నై, కేరళ, బెంగళూరు, వారాణశి, మదురై, లక్నవూ తదితర ప్రాంతాలకు నిమ్మ ఎగుమతవుతుంది. నిమ్మ అమ్మకాల్లో దేశాన్నే ఢిల్లీ మార్కెట్ శాసిస్తుంటే, దాన్ని ఇక్కడ మార్కెట్ శాసించడం విశేషం. ఖండాంతరాలకు సైతం పొదలకూరు నిమ్మ ఎగుమతవుతోంది.

మా ఊళ్లోనే నిమ్మసాగు



చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎక్కడా నిమ్మ సాగంటే తెలియని రోజుల్లో ఆరు దశాబ్దాల క్రితం మా ఊళ్లో మా తండ్రి నలగర్ల కృష్ణయ్య సాగు చేపట్టారు. తర్వాత దీనిపై రైతులు ఆసక్తి పెంచుకుంటూ వచ్చారు. గ్రామంలో ప్రస్తుతం వంద తోటలకుపైబడి సాగవుతున్నాయి.

– నలగర్ల విజయభాస్కర్, రైతు, చాటగొట్ల

నిమ్మ సాగే జీవితం



నిమ్మ సాగే మా జీవితంగా మారింది. వారసత్వంగా వస్తోంది. మా పిల్లలూ సాగు చేస్తున్నారు. నాకు మూడు చోట్ల నిమ్మతోటలున్నాయి. బాగా కలిసి రావడంతో ఆర్థికంగా స్వావలంబన పొందుతున్నా. నిమ్మతోట మాకు సెంటిమెంట్‌గా మారింది.

– పలుకూరు పెంచలనారాయణరెడ్డి, రైతు, మొగళ్లూరు

యార్డు బాగా అభివృద్ధి చెందింది



పొదలకూరు నిమ్మ మార్కెట్ యార్డులో దుకాణాన్ని పాతికేళ్ల క్రితం ఏర్పాటు చేసుకున్నా. తొలి రోజుల్లో మనుషులు కనిపించేవారు కారు. వ్యాపారం ఎలా చేయాలో తెలియక సతమతమయ్యేవాడ్ని. ప్రస్తుతం ఎంతో అభివృద్ధి చెందింది. వందల మందికి ఇక్కడ ఉపాధి లభించడం సంతోషంగా ఉంది.

– బాలకృష్ణారెడ్డి, వ్యాపారి, నిమ్మ మార్కెట్ యార్డు

నకిలీ బంగారంతో పాన్‌బ్రోకర్లకు టోకరా

- ఎనిమిది మందికి బురిడీ
- చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు



వివరాలను వెల్లడిస్తున్న సీఐ వేమారెడ్డి

సంగం: నకిలీ బంగారంతో పాన్‌బ్రోకర్లకు టోకరా వేస్తున్న ఇద్దరు ఘరానా మోసగాళ్లను సంగం పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో శనివారం నిర్వహించిన సమావేశంలో నిందితుల వివరాలను సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్ వెల్లడించారు. జలదంకి మండలం రామవరప్పాడుకు చెందిన కడియాల వెంకటేశ్వరరావు, లింగసముద్రానికి చెందిన వేలూరు అజయ్‌కుమార్ ముఠాగా ఏర్పడి పాన్‌బ్రోకర్లను మోసం చేయసాగారు. ఈ క్రమంలో స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని ఆగ్మాండ్ ఫైనాన్స్ కంపెనీ మేనేజర్ రాము వద్దకు బుధవారం రాత్రి పది గంటల ప్రాంతంలో కారులో వచ్చారు. తమ వద్ద గల బ్రాస్‌లెట్, బంగారు చైన్లను కుదువ పెట్టి రూ.1.2 లక్షలతో ఉడాయించారు. అనంతరం బంగారాన్ని పరీక్షించగా, నకిలీదని తేలడంతో అదే రోజు రాత్రి సంగం పోలీసులను బాధితుడు ఆశ్రయించారు. దీంతో ఎస్సై, సిబ్బందితో కలిసి సీసీ ఫుటేజీలను పరిశీలించారు. నెల్లూరులోని దాబాలో వీరు మద్యం సేవిస్తుండగా, అదుపులోకి శుక్రవారం తీసుకొని తమదైన శైలిలో విచారించారు. హైదరాబాద్‌కు చెందిన రమేష్ వెండి బ్రాస్‌లెట్లు, చైన్లు, ఆభరణాలను తయారుచేసి బంగారు కోటింగ్, హాల్‌మార్క్ నంబర్‌ను సైతం ఏర్పాటు చేసి తమకు ఇచ్చిన విషయాన్ని నేరస్తులు తెలియజేశారు. విజయవాడ, కర్నూలు, నందికొట్కూర్, బద్వేల్, కడప, ఆత్మకూరు, గూడూరు, సంగం ప్రాంతాల్లో ఒక్కొక్కరి వద్ద నకిలీ బంగారు ఆభరణాలను కుదువపెట్టి రూ.1.2 లక్షల మేర తీసుకున్నామని వీరు అంగీకరించారు. దీంతో వీరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. ఎస్సై, కానిస్టేబుల్ పుల్లయ్య పాటు సిబ్బందికి రివార్డులను ప్రకటించారు. కాగా నిందితులను పోలీసులు విచారణ జరుపుతున్న సమయంలో, వారి నంబర్‌కు ఓ పాన్‌బ్రోకర్ ఫోన్ చేసి వడ్డీని ఎప్పుడు కడతారని అడగడం గమనార్హం.

నాలుగు విద్యుత్ మోటార్ల చోరీ



వెంకటాచలం: మండలంలోని తిక్కవరప్పాడులో నాలుగు విద్యుత్ మోటార్లు శనివారం తెల్లవారుజామున చోరీకి గురయ్యాయి. వివరాలు.. గ్రామానికి చెందిన మంచు నాగేశ్వరరావు, మండల సుధాకర్, గుండాల ఇరగాళయ్య తమ పొలాలకు వెళ్లి చూడగా, ఇవి కనిపించలేదు. గుర్తుతెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి వీటిని చోరీ చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. ఇరగాళయ్యకు చెందిన రెండు.. మంచు నాగేశ్వరరావు, మండల సుధాకర్‌కు సంబంధించిన ఒక్కో మోటార్ చోరీకి గురయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో దివ్యాంగుడి మృతదేహం లభ్యం



విడవలూరు: మండలంలోని అలగానిపాడులో గల పెద్దకాలువలో దివ్యాంగుడి మృతదేహం శనివారం కొట్టుకొచ్చింది. అటుగా వెళ్తున్న వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని పోలీసులు విచారించగా, మృతుడ్ని రాజుపాళెం గ్రామం నిమ్మతోట వాసి కట్టా మురళి (51)గా గుర్తించారు. సమాచారాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశారు. బహిర్భూమి నిమిత్తం రాజుపాళెం పెద్ద కాలువ కట్టవైపు శుక్రవారం ఉదయం పది గంటల ప్రాంతంలో వెళ్లగా, తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆరాతీసినా ప్రయోజనం లభించలేదు. తాజాగా మరోసారి శనివారం వెతుకున్న వీరికి ఈ సమాచారం అందింది. ఘటన స్థలానికి చేరుకొని గుండెలవిసేలా రోదించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం నెల్లూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించామని ఎస్సై నరేష్ తెలిపారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బుజబుజనెల్లూరులోని క్రీడా మైదానంలో ఏపీ ట్రాన్స్‌కో, నెల్లూరు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్ సర్కిల్ క్రికెట్ టోర్నీ శనివారంతో ముగిసింది. ఫైనల్స్‌లో నెల్లూరుతో తలపడిన విశాఖపట్నం జట్టు విజయం సాధించింది. విజేతలకు బహుమతులను ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ అందజేశారు. నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్, ఏఈఈ అల్తాఫ్, ఎస్పీడీసీఎల్ జిల్లా స్పోర్ట్స్, గేమ్స్ సెక్రటరీ వేలు తదితరులు పాల్గొన్నారు.

సస్పెక్ట్ షీటర్ దారుణహత్య



చిన్నా (ఫైల్)



రక్తపు మడుగులో మృతుడు

నెల్లూరు సిటీ: సస్పెక్ట్ షీటర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అత్యంత దారుణంగా హతమార్చిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. నగరంలోని ఉడ్‌హౌస్‌సంఘానికి చెందిన రాజా, వేళాంగిణి దంపతుల రెండో కుమారుడు కోడూరు కల్యాణ్ అలియాస్ చిన్నా (26) పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. నవాబుపేట పోలీస్‌స్టేషన్లో ఈయనపై సస్పెక్ట్ షీట్ నమోదైంది. ఈ క్రమంలో తన స్నేహితులతో కలిసి ఉడ్‌హౌస్‌సంఘం వెనుక రోడ్డులో మద్యాన్ని సేవించసాగారు. ఈ తరుణంలో గుర్తుతెలియని వ్యక్తులు ఒక్కసారిగా కత్తులతో దాడికి పాల్పడ్డారు. దీంతో స్నేహితులు అక్కడి నుంచి పరారయ్యారు. టెంకాయలు నరికే కత్తితో పొడవడంతో చిన్నా అపస్మారక స్థితికి చేరుకున్నారు. స్థానికులు గమనించి హాస్పిటల్‌కు తరలించేలోపు మార్గమధ్యలో మృతి చెందారు. కాగా యేటి పండగ సందర్భంగా కొందరు యువకులతో గొడవ పడ్డారని, హత్య వెనుక వారి హస్తం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు.

రెండేళ్ల క్రితం సోదరుడి హత్య..

మృతుడి సోదరుడు సాయిపై రెండేళ్ల క్రితం వ్యక్తిగత కారణాలతో నగరంలోని వెంకటేశ్వరపురంలో కొందరు కత్తులు, రాళ్లతో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ క్రమంలో రెండో కుమారుడూ హత్యకు గురవడంతో తల్లి రోదిస్తున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. నవాబుపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.